సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 16 | జూన్ | 2024



వాన రాకడ మీ అరచేతిలో

గ్రామస్థాయిలోనే వాతావరణం అంచనాలను వాతావరణ విభాగం అందిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌తో సులభంగా వివరాలు తెలుసుకోవచ్చు. 8లో ▸



ప్రభుత్వాలను నిలదీయాలి

ప్రజా అనుకూల విధానాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపునిచ్చారు. 8లో ▸

24 నుంచి క్రికెట్ పోటీలు



ఈనెల 24 నుంచి జరిగే అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును శనివారం ఎంపిక చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ముసుగులు తొలగుతున్నాయ్



వైఎస్సార్ విగ్రహం, కమ్యూనిస్టు స్థూపానికి తొలగిన ముసుగులు

సాక్షి స్పందన

భీమవరం: ఎన్నికల నిబంధనల పేరుతో రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీ జెండా స్థూపాలకు వేసిన ముసుగులు తొలుగుతున్నాయి. ఈనెల 12న 'సాక్షి'లో 'ముసుగులు తొలగేదెప్పుడో?' శీర్షికన ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించారు. విగ్రహాల ముసుగులు తొలగిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నెలలో కోడ్ అమలులోనికి రావడంతో నాయకులు విగ్రహాలు, పార్టీల జెండా స్థూపాలు, వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసిన పంచాయతీ సూచిక బోర్డులు వంటి వాటికి ముసుగులు వేశారు. గతనెల 13న పోలింగ్, ఈనెల 4న ఓట్ల లెక్కింపు పూర్తికాగా ఈనెల 6న ఎన్నికల కోడ్ నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కోడ్‌ను నిలుపుదల చేసి వారం రోజులు గడుస్తున్నా విగ్రహాల ముసుగులు తొలగించలేదు. 'సాక్షి' కథనంతో అధికారులు స్పందించి వీరవాసరంలో కమ్యూనిస్ట్ స్థూపం, విస్సాకోడేరు గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులు తొలగించారు. అలాగే మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ముసుగులు కూడా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటీటీలకు యమ క్రేజ్

నెట్‌ఫ్లిక్స్.. డిస్నీ హాట్‌స్టార్.. అమెజాన్ ప్రైమ్.. ఆహా.. జీ5.. జియో.. సోనీలివ్ ఏదైనా కాని ఐదేళ్ల క్రితం వరకు ఈ ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫాంల గురించి తెలిసింది కొద్దిమందికే. అన్ని రంగాలనూ కుదేలుచేసిన కరోనా ఓటీటీకి మాత్రం కాసుల వర్షం కురిపించింది. లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితమైన జనానికి ఏకైక వినోద సాధనమైంది. సరికొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సీరియళ్లు, వినూత్న కంటెంట్‌తో ఆకర్షించింది. చౌకైన ప్లాన్లు, ఇంటిల్లిపాదీ చూసే వీలుండటంతో అతికొద్ది కాలంలోనే వీటికి జనాదరణ అమాంతం పెరిగింది. భారీ బడ్జెట్ సినిమాలు సైతం నేరుగా ఓటీటీలోకి వస్తున్నాయంటే వీటి క్రేజ్ అర్థం చేసుకోవచ్చు.

ఇంటింటా వినోదం

- ఖర్చు తక్కువ, సౌలభ్యం ఎక్కువ
- కుటుంబంతో కలిసి ఇంటి నుంచే వీక్షించే వెసులుబాటు
- సరికొత్త సినిమాలు, కంటెంట్‌తో ఆకట్టుకుంటున్న ఓటీటీ ప్లాట్‌ఫాంలు
- అన్నివర్గాలకూ అందుబాటులో ప్లాన్‌లు
- స్ట్రీమింగ్ యాప్‌లకు పెరిగిన ఆదరణ
- థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య తగ్గుముఖం



సండే స్పెషల్

సాక్షి, భీమవరం: మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు మంచి వినోద సాధనం సినిమా. ఇంటిల్లపాది అంతా కలిసి థియేటర్‌కు వెళ్లి ఆనందించే వాళ్లు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐదేళ్ల క్రితం పలు టూరింగ్ టాకీస్‌లు ఏసీ థియేటర్లుగా రూపాంతరం చెందాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 45, ఏలూరు జిల్లాలో 31 థియేటర్ల వరకు ఉన్నాయి. పట్టణాల్లో వెండితెర 70 ఎంఎం నుంచి మల్టీప్లెక్స్ స్థాయికి ఎదిగింది. వినోదంతో పాటు షాపింగ్, ఫుడ్ పాయింట్ కేంద్రాలుగా థియేటర్లు మారాయి. కాలక్రమంలో టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్‌డ్రింక్ ధరలు చూసి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం భార్యాపిల్లలతో సినిమాకు వెళితే సగటు ప్రేక్షకుడికి రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతోంది. సినిమా హాళ్లలో ధరల మోతతో ఓటీటీలకు జనాదరణ పెరగడం థియేటర్లకు అశనిపాతంలా మారింది.

కరోనాతో పెరిగిన ఆదరణ

ఓటీటీ అంటే కేబుల్ టీవీ, డీటీహెచ్ కనెక్షన్ అవసరం లేకుండా ఇంటర్నెట్ ద్వారా వినోదాన్ని అందించే సాధనం. దీనినే డిజిటల్ స్ట్రీమింగ్ మీడియా సర్వీస్ అని కూడా పిలుస్తారు. ఇందులో సినిమాలతో పాటు వెబ్ సిరీస్, టీవీ కార్యక్రమాలు, సెలబ్రిటీ తదితర షోలు ప్రసారం చేస్తారు. కరోనా సమయంలో ఓటీటీ క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ఆ సమయంలో ఓటీటీ ప్లాట్‌ఫాంలే ప్రజలకు వినోద సాధనంగా మారాయి. ఓటీటీ యాప్‌లు స్మార్ట్ టీవీల్లోనే ఇన్‌స్టాలై ఉండటం, తక్కువ ధరలు, సులభ వాయిదాల్లో ఈ టీవీలు లభ్యమవుతుండటంతో అన్నివర్గాల వారు వీటి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు చాలా వరకు ఇళ్లల్లో స్మార్ట్ టీవీలే కనిపిస్తున్నాయి. ఏపీ ఫైబర్, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లు తక్కువ ప్లాన్‌లలోనే నెట్ సదుపాయం అందిస్తుండటం ఓటీటీకి వరంలా మారింది.

ప్లాన్లతో ఆకర్షిస్తూ..

ఓటీటీ ప్లాట్‌ఫాంలు క్వార్టర్, హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ పేరిట తక్కువ ధరల సబ్‌స్క్రిప్షన్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. రీచార్జి ప్లాన్‌ను బట్టి టీవీతో పాటు సెల్‌ఫోన్ ఇతర ఐదు వరకు డివైజ్‌లలో ఆయా యాప్‌లను ఏడాది పాటు చూడొచ్చు. ఇంటర్నెట్ ద్వారా ఓటీటీ పనిచేయడం వలన అంతరాయం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు నచ్చిన కార్యక్రమాలు చూసే వీలుంటుంది. ఎలాంటి ప్రకటనలు లేకుండా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూసే వీలుండటం, కొన్ని ఓటీటీల్లో టీవీ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారాలు రావడం వీటికి బాగా కలిసొచ్చింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకోలేని వారి కోసం ఉచితంగా కొన్ని ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి రుసుం లేకుండానే వీటిలో కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూడవచ్చు. అయితే వీటిలో వాణిజ్య ప్రకటనలు అధికంగా ఉంటాయి.

నేరుగా ఓటీటీలోనే..

చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు, చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు కొన్ని నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా మరికొన్ని వారం పదిరోజుల్లో ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో ఓటీటీలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు చైనీస్, జపాన్, కొరియన్ సినిమాలు, వెబ్‌సిరీస్‌లు స్థానిక భాషల్లో అలరిస్తున్నాయి.

థియేటర్లు వెలవెల

ఓటీటీలకు ఆదరణ పెరగడంతో సినిమా థియేటర్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొత్త సినిమాలు విడుదలైన సందర్భంలో ఒకటి రెండు రోజుల సందడి మినహా తర్వాత థియేటర్లు ఖాళీ అయిపోతున్నాయి. ఒకసారి కుటుంబంతో థియేటర్‌కు వెళ్లి ఒక సినిమా చూడటానికి అయిన ఖర్చుతో ఒకటి, రెండు ఓటీటీలను ఏడాదంతా చూడవచ్చు. దీంతో నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదని, నష్టాల్లో నడుపుతున్నామని థియేటర్ యజమానులు అంటున్నారు.

సెల్‌ఫోన్‌లోనే చూస్తున్నాం



గతంలో సెలవు రోజుల్లో థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవాళ్లం. ఇప్పుడు ఓటీటీలోనే తక్కువ ఖర్చుతో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు సెల్‌ఫోన్‌లోనే చూసే వీలు కలిగింది. థియేటర్‌కు వెళ్లి చూడాలంటే చాలా ఖర్చయ్యేది. ఇప్పుడు తక్కువ ఖర్చుతో ఇంట్లోనే సినిమాలు చూస్తున్నాం.
– వి.నానాజీ, రాయలం

చాలా వరకు తగ్గారు



ఓటీటీలు వచ్చాక థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుల సంఖ్య చాలా తగ్గింది. పెద్ద హీరోల సినిమాలు బాగుంటే నాలుగు వారాలు లేదా పది రోజుల హడావుడి ఉంటుంది. ఓటీటీలతో పబ్లిక్ ఇంట్రెస్ట్ బాగా తగ్గింది. మెయింటెనెన్స్ ఖర్చులు కూడా రావడం లేదు.
– డి.బుజ్జి, మారుతీ థియేటర్ మేనేజ్‌మెంట్, పాలకొల్లు

ఆదర్శ పాలన అందించాం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రెండేళ్లలో కరోనా విపత్తు ఉందని, అనంతరం మూడేళ్లు జనరంజక పాలన అందించామని మాజీ ఉప ముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ అన్నారు. కరోనా కాలంలోనూ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. అధికారం లేకపోయినా ప్రజలకు అండగా నిలుస్తామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళతామన్నారు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తున్నామని, ప్రజలందరికీ న్యాయం చేయాలనే తపనతోనే ఉన్నామన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టుపై వ్యాఖ్యలు చేయడం కూటమి సభ్యుడు వలవల మల్లికార్జునరావు స్థాయికి తగదన్నారు. ఆయన స్థాయిని మరిచి విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో కొట్టు ద్వారానే ఆయన రాజకీయాల్లోకి వచ్చి కౌన్సిలర్‌గా గెలుపొందారని గుర్తు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద పార్కింగ్ స్థలాలను ఆక్రమించి దుకాణ సముదాయాలను నిర్మించి కోట్లతో దండుకున్నారని ఆరోపించారు. దుకాణ సముదాయాలను తొలగించాలని హైకోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. సంపతరావు కృష్ణారావు మాట్లాడుతూ మంత్రిగా కొట్టు హయాంలో నియోజకవర్గంలో రూ.1,100 కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. కొన్ని పనులు పూర్తవగా, మరికొన్ని కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నేతలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, బండారు నాగు, చెన్నా జనార్దన్, మానికొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా వార్షికోత్సవం



క్షేత్రదేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ యాగ శాలలో హోమాలు నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, సర్వతోభద్ర మండలి ఆరాధన, మూల మంత్ర అనుష్టానం అనంతరం హోమాలను ఆలయ అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో జరగనున్న పూర్ణాహుతితో ఈ వార్షికోత్సవ వేడుకలు ముగుస్తాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ భూముల విక్రయానికి ఆన్‌లైన్ బిడ్డింగ్

పాలకొల్లు సెంట్రల్ : బీఎస్ఎన్ఎల్‌లో ఉపయోగంలో లేని భూములను విక్రయిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జీఎం ఎల్.శ్రీను తెలిపారు. శనివారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో మాట్లాడుతూ పట్టణంలోని విజయ ఆర్థోపెడిక్ ఆసుపత్రి పక్కన ఉన్న 1.03 ఎకరాలు భూమిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ భూమి కొనుగోలుకు జూన్ 13 నుంచి ఆన్‌లైన్ బిడ్స్ ప్రారంభించామన్నారు. పూర్తి వివరాలకు 94235 65008, 94901 22622 నెంబర్లలో బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సుకు ఆహ్వానం


ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సు కోసం ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని జిల్లా హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ అధికారి రఘునందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు కాలేజ్ వెబ్‌సైట్ లేదా 94417 95408, 98661 69908, 90102 43054 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాన రాకడ మీ అరచేతిలో

యాప్‌లతో రైతులను అప్రమత్తం చేస్తున్న వాతావరణ శాఖ

భీమవరం : గతంలో వాతావరణం సమాచారం రైతులకు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడ్డ లక్షలాదిమంది తీవ్రంగా నష్టపోయేవారు. వరి నారుమడి వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు వర్షాలతో రైతన్నకు ఇబ్బందులు తప్పేవికావు. వర్షాలు, ఈదురు గాలుల తీవ్రతకు పంటకు తీవ్ర నష్టం ఏర్పడేది. పిడుగులు వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు ప్రాణాలు కోల్పోయేవారు. పిడుగు పడే అవకాశం ముందుగా తెలుసుకునే అవకాశం లేక పోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా జరిగేది. భారీ వర్షాలతో పంట చేలు దెబ్బతినేవి. ఇలాంటి పరిస్థితికి భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్ నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వీలు ఏర్పడింది.

విత్తనం వేయడం దగ్గర నుంచి ఎరువులు వేసే సమయం, పంట మాసూళ్ల సమయంలో వర్షం వల్ల రైతుకు నష్టం వాటిల్లేది. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు 'మేఘదూత్' యాప్ రూపుదిద్దుకుంది. 'మేఘదూత్' సాయంతో వారం రోజులు ముందుగానే నాలుగైదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచన, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో ఆగ్రోమెట్ ఫీల్డ్ యూనిట్లు(ఏఎంఎఫ్‌యూ) రైతులకు మెసేజ్ పంపుతున్నాయి.



పిడుగు సమాచారం కోసం వజ్రపాత్

గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనమున్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్స్ వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్దిసేపట్లో ఎంత దూరంలో పిడుగు పడే అవకాశముందో చూపిస్తుంది. దీంతో రైతులు, ప్రజలు అప్రమత్తమయ్యే అవకాశముంటుంది.

రెయిన్ అలారం

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడికి అందిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం పడే అవకాశముందో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

వెదర్ యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు

వెదర్ యాప్ అందుబాటులోకి రావడంతో ముఖ్యంగా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుంది. రైతులకు వర్ష సూచన తెలియకపోవడంతో విత్తనాలు, ఎరువులు వేసుకోవడం పురుగుమందుల పిచికారి చేసిన వెంటనే వర్షం రావడం వల్ల నష్టపోతున్నారు. వెదర్ యాప్‌తో వర్ష సూచనలు తెలుసుకోవడం ద్వారా అప్రమత్తమయ్యే అవకాశాలు ఉంటాయి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

అలవెన్స్ బకాయిలు చెల్లించాలి

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇంతవరకూ ఎన్నికల అలవెన్స్ ఇవ్వకపోవడం బాధాకరమని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సీఐటీయు అనుబంధం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మాణిక్యాలరావు అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఎన్నికల్లో అన్ని రకాల విధులు నిర్వహించిన గ్రామ రెవెన్యూ సహాయకులకు అలవెన్స్ తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.

సోమేశ్వరస్వామి హుండీ లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసి ఉన్న పంచారామక్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలో 95 రోజులకుగాను శనివారం హుండీలు తెరచి లెక్కించగా రూ.6,26,732 నగదు వచ్చిందని ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపులో గ్రామస్తులు పాల్గొనగా, దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

డ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థలు ప్రక్షాళన చేయాలి



భీమవరంలో కౌలు రైతు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జలమయ్య

భీమవరం: డెల్టా ప్రాంతంలోని డ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేయాలని వరి, ఆక్వా రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలో తిరుమాని కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా డెల్టాలో ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థలను పట్టించుకోకపోవడంతో కొద్దిపాటి వర్షానికే పంటలు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయిన్లలో తక్షణం పూడిక తీయడమేగాక తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రబీ ధాన్యం బకాయిలు రూ.850 కోట్లకుపైగా పేరుకుపోయాయని వాటిని తక్షణమే విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో కూటమి రైతులకు ప్రకటించిన రూ. 20 వేల పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులకు కూడా ఇవ్వాలని, గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి వారికి సెల్ఫ్ డిక్లరేషన్ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ గత రబీ ధాన్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సార్వా పెట్టుబడులను సమకూర్చాలని, రుణాలను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్ ప్రసాద్, కళింగ లక్ష్మణరావు, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలి

రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపు



రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏలూరులో నిర్వహించిన భారీ ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): ప్రజా అనుకూల విధానాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పిలుపు నిచ్చారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు శనివారం ఏలూరులో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభ అనంతరం వేలాది మంది రైతు కూలీలు, ఆదివాసీలతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలు నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఫ్లైఓవర్, కెనాల్ రోడ్, అంబికా సెంటర్, మెయిన్ బజార్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మౌలిక సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఆదివాసీలను అడవుల నుంచి తరిమేసే విధానాల పట్ల పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. పాలకులు ఎవరైనా కార్పొరేట్, సామ్రాజ్యవాదులకు అనుకూల విధానాల్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు వెంటనే సమగ్ర శాస్త్రీయ పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. ఏఐఎస్టీయు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్ బాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఐక్యంగా రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు చల్లపల్లి విజయ మాట్లాడుతూ రైతు కూలీ, పేద మహిళలపై గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారీ శక్తులు సాగిస్తున్న అత్యాచారాలు, దాడులను తీవ్రంగా ఖండించారు. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుంటున్న పాలకుల విధానాలపై సమష్టి పోరాటాలు సాగించాలన్నారు. ఈ సభలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, తెలంగాణ నాయకులు ప్రసాదన్న, బిహార్ నాయకులు అశోక్ బైతా, పీడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఏ.సురేష్, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. మహాసభల సందర్భంగా శనివారం సాయంత్రం ఏలూరు నగరంలో నిర్వహించిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ఆదివాసీల సంప్రదాయ నృత్యం, ప్రజా కళాకారుల డప్పు నృత్యాలు అలరించాయి. పోలవరం నిర్వాసితులతో పాటు, రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతు కూలీ పేదలు ఎర్రజెండాలు చేబూని, నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సభా వేదికపై విప్లవ ఉద్యమ అమరవీరుల త్యాగాల గురించి గానం చేస్తూ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.



ప్రదర్శన ముందు భాగంలో డప్పు కళాకారుల నృత్యాలు

ఉద్యోగాల ఎంపికలో అవకతవకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలో శిశు సంక్షేమ శాఖలో ఇటీవల జరిగిన ఉద్యోగ నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని రవి కుమార్ అనే నిరుద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఉద్యోగాలకు విద్యార్హత లేకపోయినా జిల్లా అధికారుల కుటుంబ సభ్యులనే ఎంపిక చేశారని విమర్శించారు. ఫిర్యాదుపై స్పందించడంతో ఏపీ సెక్రటేరియట్ నుంచి శైలజ అనే అధికారి శనివారం ఏలూరుకు చేరుకుని ఈ అంశంపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదురారు రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖలో మొత్తం 19 పోస్టులకు 11 పోస్టులకు జిల్లా అధికారులు భారీ మొత్తంలో మామూళ్లు వసూలు చేసి ఉద్యోగ ఎంపికలు చేశారన్నారు. తనకు అకౌంటెంట్ పోస్టుకు అర్హత ఉన్నా డీసీఓ కార్యాలయంలో పని చేసే వ్యక్తి తన కుమారుడికి ఉద్యోగం వేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిశు గృహ మేనేజర్ ఉద్యోగానికి విద్యార్హత పీజీ ఉండాల్సి ఉండగా గత సంవత్సరం ఈ పోస్టుకు ఎంపిక చేసిన వ్యక్తికి పీజీ విద్యార్హత లేదనే విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు ఉద్యోగాల్లో అర్హత పొందడం జిల్లా శిశు సంరక్షణ అధికారికి ఇష్టంలేదని ఆరోపించారు.

ఆర్చరీ పోటీల్లో పతకాలు



భీమవరంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: భీమవరం పట్టణంలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీపడ్డారు. అండర్-15 బాలికల విభాగంలో వి.స్ఫూర్తి, కె.హేమశ్రీ, వి.శ్రద్ధ విజేతలుగా నిలవగా బాలుర విభాగంలో సీహెచ్ హృషికేష్ నాయుడు గెలుపొందారు. అండర్-13 బాలికల విభాగంలో కె.తనన్య, కె.సమీక్షారెడ్డి, వి.శ్రద్ధ, బాలుర విభాగంలో జి.రిత్విక్, ఎ.హర్షవర్ధన్ గెలుపొందారు. అండర్-10 బాలికల విభాగంలో కోమలి స్పందనారెడ్డి, సత్యశివానీ విజయం సాధించగా అండర్-15 రికర్వ్ బాలికల విభాగంలో కె.సాత్విక, ఎస్.హంసిని, అండర్-10 బాలుర విభాగంలో ఆర్.దుష్యంత్, అండర్-15 ఇండియన్ రౌండ్‌లో ఎస్.బన్నీరాజ్, అండర్-13 విభాగంలో పి.రిత్వక్‌రాజ్, అర్జున్‌రాజ్, అండర్-10 విభాగంలో సీహెచ్ హర్షద, ఎస్ శ్రీహర్ష విజయం సాధించారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్ జయరాజు చెప్పారు. విజేతలు ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

పడాలలో వ్యక్తి హత్య

తాడేపల్లిగూడెం: మండలంలోని పడాలలో పాత బాకీ వసూళ్ల నేపథ్యంలో తలెత్తిన ఘర్షణలో శనివారం రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పడాల గ్రామానికి చెందిన లింగంపల్లి రాము ఇంటికి లింగంపల్లి బాబి బాకీ వసూలు కోసం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య సొమ్ము విషయంలో తీవ్ర ఘర్షణ తలెత్తింది. దీంతో లింగంపల్లి బాబి ఒక్కసారిగా రాముపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనను చూసి అడ్డుకోవడానికి వెళ్లిన రాము బంధువులు కొత్త శ్రీను, కొత్త సరస్వతిలపై కూడా బాబి దాడి చేశాడు. అయితే కత్తిపోట్లకు గురైన రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు లింగంపల్లి బాబి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

24 నుంచి ఏసీఏ క్రికెట్ పోటీలు



అండర్-16 జట్టుకు ఎంపికైన బాలురు

ఏలూరు రూరల్: ఈ నెల 24 నుంచి మంగళగిరిలో అండర్-16 బాలుర అంతర జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు శనివారం నిర్వహించామని పేర్కొన్నారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల క్రికెట్ మైదానంలో చేపట్టిన ఎంపిక పోటీలకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి బాలురు తరలివచ్చారని వివరించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

భీమవరం: అప్పులు తీర్చలేక భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన యువకుడు కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ సీజే ప్రసాద్ శనివారం చెప్పారు. రాయలంకు చెందిన జి.శేషయ్య కుమారుడు బాలవెంకట దుర్గాచైతన్య(23) సొంత అవసరాలకోసం కొంత మొత్తం అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 11న కలుపు నివారణకు వాడే మందు తాగి ఆ విషయాన్ని ఫోన్‌లో మేనమామ మల్లేశ్వరరావుకు చెప్పారు. వెంటనే దుర్గా చైతన్యను చికిత్స కోసం భీమవరంలోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రిలో చేర్చగా అప్పటికే పరిస్థితి విషమించింది. ఫలితం లేదని వైద్యులు చెప్పడంతో ఇంటికి తీసుకొస్తుండగా మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రీ స్కూల్ పాస్




ఈ చిన్నారులు అంగన్‌వాడీ స్కూలు విద్య పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పట్టా పొంది ఒకటో తరగతిలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆకివీడు మండలంలోని తరటావ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్‌లో స్నాతకోత్సవ సభ నిర్వహించి పట్టాలు అందజేశారు. అనంతరం దగ్గరలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థుల్ని చేర్చుకున్నారు. జిల్లాలోని పలుచోట్ల ఈ స్నాతకోత్సవాలు నిర్వహించారు.

– ఆకివీడు

వెంకన్నకు తామరపూల అలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని తామరపూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శనివారం వెంకటేశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ స్వామివారిని తామరపూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాపులకొడపలో వెంకటేశ్వరస్వామికి తామరపూల అలంకరణ

క్లుప్తంగా

విద్యతోనే దేశాభివృద్ధి



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు: విద్యతోనే దేశం అభివృద్ధి సాధ్యమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండల ప్రాంగణంలో నూతన స్కూలు బ్యాగులు, పుస్తకాల కిట్లు శనివారం ఆయన అందించారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, టీడీపీ నాయకులు దాసరిఅప్పన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి వెంకటరావు, పసల అచ్యుతం, జనసేన నాయకులు పుల్లా బాబి, వర్తనపల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేస్తున్న తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న మూడు జతల యూనిఫాంతోపాటు స్టూడెంట్ కిట్లు శనివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విద్యార్థులకు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలతోపాటు బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల ఆడిటోరియం పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, కలగర వెంకటకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బసవా రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు. అనంతరం తణుకు సొసైటీ రోడ్డులోని అన్న క్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. రాబోయే వంద రోజుల్లోపు అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

తణుకు ఏఎంసీ పాలకవర్గం రాజీనామా



రాజీనామా పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు

తణుకు: తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణితోపాటు పాలకవర్గ సభ్యులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీమాలు చేశారు. చైర్‌పర్సన్ కృష్ణవేణితోపాటు వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పాలకవర్గ సభ్యులు ఏఎంసీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేశారు.

వైభవంగా రుద్రయాగం



రుద్రయాగం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోక కల్యాణార్థం స్థానిక శంకరమఠంలో నిర్వహిస్తున్న రుద్రయాగంలో శనివారం స్వామి వారికి రుద్ర క్రమార్చన జరిగింది. ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి, సర్వమంగళ అమ్మవారికి పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఆదిశంకరాచార్య స్వామికి విశేష అర్చనలు చేశారు. మూడో రోజు ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు చేశారు. పాలకొల్లుకు చెందిన చాగంటి లింగరాజు దక్షయజ్ఞం ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది. యాగ ఏర్పాట్లను దీక్షాధారులు ప్రయాగ కిషోర్, జ్యోశ్యుల పాండురంగ శాస్త్రి తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తణుకు: మహాకవి శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక అమరవీరుల భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సేవా విజ్ఞానకేంద్రం చైర్మన్ పి.దక్షిణామూర్తి మాట్లాడుతూ 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి, సంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన విప్లవ కవి, అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు కవి శ్రీశ్రీ అన్నారు. పేదల కోసం ఏర్పడిన సిద్ధాంతాలు ఏవైనా నావే నంటూ గర్జించిన మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. శ్రీశ్రీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషుబాబు, పీవీ ప్రతాప్, గార రంగారావు, రాజా, బంగారమ్మ, వీర్రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు

- ఫ్రైడే–డ్రైడేగా అమలు చేస్తున్న సిబ్బంది
- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన



ఇళ్ల వద్ద నీటి నిల్వలను పరిశీలిస్తున్న హెల్త్ అధికారి, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్షకాలం రానే వచ్చింది. కాలంలో పాటుదోమలు వృద్ధి చెందుతాయి. సీజనల్ వ్యాధులు వస్తాయి. దోమలు ద్వారా వచ్చే వ్యాధులు పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తత అవసరం. దోమలను నివారించేందుకు గాను ప్రభుత్వ ఆదేశాలు మేరకు డైరక్టర్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఫ్రైడే (శుక్రవారం) డ్రైడే (పొడి వాతావరణం) కోసం వివిధ కార్యక్రమాలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారానికి ఒక్కసారి ఇలా చేయడం వల్ల కీటక జనిత ప్రదేశం లేకుండా ఉండడం, దోమల వృద్ధి నివారించడం, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఎంతో వీలు కలుగుతుంది. పట్టణంలోని వార్డు పరిధిలో, గ్రామాల పరిధిలో పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది ద్వారా విస్తృతంగా అమలు చేస్తున్నారు.

దోమల ద్వారా వచ్చే వ్యాధులు

దోమల ద్వా మలేరియా, డెంగీ, చికున్ గునియా, బోదకాలు, మెదడువాపు, విషపు జ్వరాలు, ఇతర జ్వరాలు ప్రబలతాయి. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం ముందుస్తుగా వివిధ కార్యక్రమాలను ఆరోగ్య సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు. కీటక జనిత ప్రదేశాలను గుర్తించడంతో పాటు కీటక నియంత్రణ చర్యలను తీసుకుంటున్నారు.

దోమ దశలు

ఇంటిలోపల, బయిట నిల్వ ఉన్న నీటిలో దోమ గుడ్లు పెడతాయి. దోమ గుడ్లు నుంచి లార్వా, అనంతరం వివిధ దశలలో దోమగా వృద్ధి చెందుతుంది. గుడ్డు దశ నుంచి దోమగా ఎదిగేందుకు 7 నుంచి 14 రోజులు సమయం పడుతుంది. ఈ సమయంలోనే లార్వాలు వేల సంఖ్యలో వృద్ధి చెందుతాయి.

దోమలు వృద్ధి చెందే ప్రాంతాలు

ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉన్న సంపులు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, ప్లాస్టిక్ కంటైనర్‌లలోను,



పట్టణంలో ఫ్రైడే, డ్రైడేను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న హెల్త్ సిబ్బంది



పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సిబ్బంది

నీటి గుంటలు, నీటి పారుదల లేని డ్రెయిన్‌లు, పాడుపడిన చెరువులు, అదే విధంగా ఇళ్లలో తొట్లు, బానలు, డ్రమ్ములు, కుండలు, ఫ్రిజ్‌లు, కూలర్‌లు, ఫ్లవర్ వాజ్‌లు, తాగి పాడేసిన కొబ్బరి బొండాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలలో దోమలు గుడ్లు పెడతాయి.

ఖర్చులేని పని

ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ నీరు ఉన్న తొట్లు, బానలు, డ్రమ్ములలో, ప్లాస్టిక్ కంటైనర్‌లలో నీటిని పారబోసి వాటిని పీచుతో ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. ఎలాంటి రసాయనాలు వాడం కాబట్టి వాతావరణం కలుషితం కాదు. ఆరబెట్టిన తరువాత నీటిని తిరిగి నింపాలి. వారంలో ఒక్కసారి చేయడం ద్వారా దోమ లార్వా నాశనం అవుతంది. అంతేగాక మురుగు కాలువలకు అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. డ్రెయిన్‌లలో నీటి పారుదల జరిగేలా ఉండాలి. చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలి.

వైద్య బృందాల సందర్శన

ఫ్రైడే డ్రైడే పేరుతో వైద్య బృందాలు నిరంతర ప్రక్రియగా ప్రతి ఇంటిని సందర్శిస్తాయి. ప్రజలకు అవగాహన కల్పించడం, ర్యాలీలు నిర్వహించడం, నీటి నిల్వలను తొలగించే విధంగా చూడడం, ఇంటిలోని ఫ్రిజ్‌లను, కూలర్‌లను పరిశీలించి యజమానులు తగిన సూచనలు చేయడం ప్రజలను భాగస్వాములుగా చేర్చి అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



దోమల నివారణకు, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు తప్పక సహకరించాలి. వారంలో ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటిస్తే దోమలు నివారణ సాధ్యం అవుతుంది. ఇలా చేస్తే దోమల ద్వారా వ్యాప్తి చెందే జ్వరాలు దరిచేరవు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఏ చిన్నపాటి, సాధరణ జ్వరం వచ్చిన స్థానిక వైద్య సిబ్బందికి తెలియజేయాలి.

వైవీ లక్ష్మణరావు,
మలేరియా సబ్ యూనిట్ హెల్త్ ఆఫీసర్

వ్యాధులు ప్రబలితే

వ్యాధులు ప్రబలితే వెను వెంటనే వైద్య బృందాలు ఫీవర్ సర్వేలు చేయడం, లార్వా సర్వే చేయడం, కీటక నియంత్రణ చర్యలు చేపట్టడం, ఆరోగ్య సిబ్బందిచే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, మందులు ఇవ్వడం, మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తారు. అదే విధంగా పరిసరాల్లో దోమల నివారణకు చర్యలతో పాటు ఇంటిలోపలి భాగంలో గాలిలో స్ప్రేయింగ్, ఫాగింగ్ ఆపరేషన్‌లు చేస్తారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో...

వర్షకాలంలో దోమలు పెరగడం, సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో శానిటరీ విభాగం నీటి గుంటల్లో పాడైన చెరువులత్లో గంబూషియా చేపలను వదలడం, ఆయిల్ బాల్స్ వేయడం, డ్రెయిన్‌లలో స్ప్రేయింగ్ చేయించడం, ఫాగింగ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు.

కారుమంచి యోహాన్‌కు సత్కారం



భీమవరంలో యోహాన్‌ను సత్కరిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

తణుకు: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు పట్టణానికి చెందిన కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కారుమంచి యోహాన్‌ను భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుర్తించి ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ మంతెన శివరామబద్రిరాజు చేతులమీదుగా యోహాన్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

ట్రాక్టర్, ట్రక్కు చోరీపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి ముందు ఉంచిన ట్రాక్టర్, ట్రక్కు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి. సురేష్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మాధవరం గ్రామానికి చెందిన కవులూరి నాగరామకృష్ణ ఏపీ 37 డీపీ 0020 నెంబరు ఉన్న ట్రాక్టర్, ఏపీ 39 డి8828 నెంబరు ఉన్న ట్రక్కు ఉంది. ఈ నెల 14న రాత్రి ఇంటి వద్ద పెట్టిన ట్రాక్టర్ తెల్లవారు జామున 5 గంటలకు చూసే సరికి కనిపించలేదు. దీంతో బాధితుడు రూరల్ పోలీసులను ఆశ్రయించాడు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

అత్తిలి: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి కోరారు. అత్తిలి మండలం ఉనికిలి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్‌డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ పూర్తిచేసుకుని 1వ తరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. మూడేళ్ల నిండిన పిల్లలను అంగన్‌వాడీలలో చేర్పించాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గ్యాడ్యుయేషన్ డే

తాడేపల్లిగూడెం రూరల్: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని మాధవరం అంగన్‌వాడీ కేంద్రం నెం.120, 121లో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల పోషకాలను అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కే.బంగారం, టి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి



మాధవరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధులపై వేధింపులను అరికట్టాలి

తణుకు టౌన్: సమాజంలో వృద్ధులపై పెరిగిపోతున్న వేధింపులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ప్రముఖ సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ చెప్పారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణకర్ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వృద్ధులపై వేధింపులు చాలా ఎక్కువగా వున్నాయన్నారు. వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఈసందర్భంగా వేధింపుల నివారణకు సంబంధించి పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శిరిగినీడి రామకృష్ణారావు, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు వడ్లమాని పార్వతి, నాదెళ్ల కృష్ణానందం, అక్కిన కాశీవిశ్వనాథం, బాపినీడు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పరిమి సత్యనారాయణ, పెనుమర్తి సత్యనారాయణ, గిరిజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



డి.సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి, తణుకు

తణుకు అర్బన్: తణుకు కోర్టులో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి కోరారు. స్థానిక కోర్టులో శనివారం ఆమె మాట్లాడుతూ రాజీదగ్గ ప్రతి కేసును ఇరుపక్షాల అంగీకారం మేరకు పరిష్కరిస్తామని చెప్పారు. సివిల్, చెక్కు బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంక్, మోటారు యాక్సిడెంట్, రాజీ అయ్యే క్రిమినల్ కేసులన్నీ ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవడం ద్వారా విలువైన సమయంతోపాటు డబ్బు కూడా ఆదా అవుతుందని వివరించారు.

రాజీ కేసులను పరిష్కరించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు ఈ నెల 29న ఉదయం నుంచి సాయంత్రం వరకు తాడేపల్లిగూడెం కోర్టు సముదాయాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు 11వ జిల్లా అదనపు జిల్లా జడ్జి, లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా తెలిపారు. జాతీయ లోక్ ఆదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ తగాదాలు, మోటారువాహన ప్రమాద బీమా కేసులు, ప్రీ లిటిగేషన్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కేసులను ఇరుపక్షాల మధ్య రాజీ కుదుర్చుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభ్యసనం, పరిశీలన ద్వారా ప్రతిభకు పదును

తణుకు టౌన్: అభ్యసనం, పరిశీలన ద్వారా ప్రతిభకు పదునుపెట్టవచ్చునని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కామర్స్, మేనేజిమెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్ ఉదయ్ భాస్కర్ విద్యార్థులకు సూచించారు. శనివారం తణుకులోని ఎస్కేఎస్వీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) లెక్చర్ సిరీస్‌లో భాగంగా వ్యవస్థాపక అభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యసన, పరిశీలన ద్వారా ప్రతి ఒక్కరూ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇతర కళాశాలల అధ్యాపకులు అంతర్జాలంలో వీక్షించే విధంగా జూమ్ ఏర్పాటు చేశారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఏ మారుతీదేవి చౌదరి, జీ ఇందిరాకుమారి, డాక్టర్ ఐవీ నారాయణ, డి కనక మహాలక్ష్మి, ఎస్ విష్ణువర్ధన్, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ్ భాస్కర్

నిత్యావసరాల అందజేత



ఎల్.అగ్రహారంలో నిత్యావసరాలను అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వల్లీ మోహన్ యువజన సేవా సమితికి అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తానని టీడీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి వాడపల్లి సుబ్బరాజు అన్నారు. శనివారం మండలంలోని ఎల్.అగ్రహారం వల్లీ మోహన్ యువజన సేవా సమితి కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎవరి సహకారం కోసం ఎదురు చూడకుండా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమితి సభ్యులను ఆయన అభినందించారు. మహాత్మాగాంధీ అభివృద్ధి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దుర్గారామచంద్రరావు, సేవా సమితి గౌరవాధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లీ, గొల్లేరు మోహన్, బచ్చు దినేష్, మెంటే రాంబాబు పాల్గొన్నారు.

శ్రీవరాల వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సన్నిధి నాగ వెంకట సత్యసూర్య రామలింగేశ్వరరావు, వీరపద్మ, మామిడిపల్లి రాంబాబు, నాగమణి దంపతులచే సుప్రభాతసేవ, మేలుకొలుపు సేవ, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారిని పెండ్లికుమారునిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. పడాల వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్లకు శ్వేతవస్త్రాలు సమర్పించారు. చేకూరి కృష్ణంరాజు, సునీత దంపతులచే విష్వక్సేన పూజ అంకురార్పణ, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, గరుడ హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకటనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారు

గోవిందమాలధారణలు



శ్రీవరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాలధారణ చేసిన భక్తులు

అత్తిలి: ఈడూరు శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో భక్తులు గోవిందమాలధారణ చేశారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో మాలధారణ పూజాధికాలు నిర్వహించారు. ఈనెల 22న గోవిందమాలధారణ భక్తులచే ఇరుముళ్లధారణతో గ్రామ తిరువీధి సేవ జరుగుతుందని అర్చకులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.